మణుగూరులో భగభగ

- ఈ వారం 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- కోల్‌బెల్ట్ ఏరియా కావడంతో మరింత ఎండలు
- తల్లడిల్లుతున్న సింగరేణి కార్మికులు, స్థానికులు


ఏరియా ఓసీ గనుల్లో ఎండలోనూ కొనసాగుతున్న పనులు


ఎండల తీవ్రతతో నిర్మానుష్యంగా మారిన మణుగూరు పట్టణం

మణుగూరుటౌన్: మణుగూరు పట్టణంలో భానుడి భగ భగలు రోజు రోజుకూ మండిపోతున్నాయి. గత వారం రోజులుగా ఎండలతో జనం అల్లాడిపోతున్నారు. వడగాల్పులతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. మణుగూరు ఏరియా కోల్ మైన్స్ ఏరియా కావడంతో ఎండల తీవ్రత మరింత విపరీతంగా పెరుగుతోంది. సింగరేణిలో ఉపరితల గనులు పెరగడం వల్ల అడవులు తగ్గిపోయాయి. దీంతో ఎండ తీవ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఏప్రిల్ మాసంలోనే రోహిణి కార్తెను తలపించేలా ఎండలు మెండుగా ఉన్నాయి. ఈ వారంలో గరిష్టంగా 44డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనాయి. ఉదయం 8గంటలకే సూర్యుడు తన ప్రతాపాన్ని చూస్తూ మధ్యాహ్నంకు నిప్పులు చిమ్ముతున్నట్టు ఉంది.

వ్యాపారాలకు ఎండదెబ్బ..

మధ్యాహ్నం పూట ఎండలు మండిపోతుండటంతో జనం బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎటువంటి పనులు ఉన్నా ఎండలో బయటకు రావడానికి జనం ముందుకు రావడంలేదు. దీంతో వ్యాపారాలు సైతం సక్రమంగా సాగడంలేదని పట్టణంలోని పలువురు వ్యాపారస్తులు చెబుతున్నారు. రోడ్లమీద వ్యాపారాలు చేసుకునే చిన్న చిన్న వ్యాపారులు మరింత అవస్తలు పడుతున్నారు.

సింగరేణి కార్మికులపై ప్రభావం..

మణుగూరు ఏరియాలోని ఉపరితల గనుల్లో పనిచేసే కార్మికులు ఎండ తీవ్రతకు గురవుతున్నారు. ఉదయం షిఫ్టులోకి విధులకు హాజరయ్యే కార్మికులు ఓపెన్‌కాస్టు గనుల్లో మండుటెండల్లో పనిచేస్తూ వడదెబ్బకు గురవుతున్నారు. ఒక పక్క ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు వేడిమితో పైన సూర్యుడి ప్రతాపానికి మధ్యన కార్మికులు నలిగిపోతున్నారు. ఏప్రిల్ నెలలోనే ఈవిదంగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో సింగరేణిలో కార్మికులు పనివేళలు మార్చాలని కార్మికులు కోరుతున్నారు. షిఫ్టు వేళల్లో మార్పులు చేసి కార్మికులను ఎండ తీవ్రత నుంచి కాపాడాలని కార్మిక సంఘాలు సైతం కోరుతున్నాయి.

పనివేళల్లో మార్పు చేయాలి



ఎండలు రోజు రోజుకూ పెరిగిపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగరేణిలో కార్మికుల పనివేళలు మార్చి ఎండ దెబ్బనుంచి కాపాడాలి. వేసవి రక్షణ చర్యలు చేపట్టాలి. ఓపెన్ కాస్టు గనుల్లో రెస్టు షెల్టర్లు ఏర్పాటు చేయాలి. కార్మికులకు మజ్జిగ అన్ని వేళల్లో అందుబాటులో ఉంచాలి.

– వై. రాంగోపాల్, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి, మణుగూరు

వేసవి రక్షణ చర్యలు చేపట్టాలి



మణుగూరు ఏరియాలో రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్నాయి. కార్మికులు మండుటెండల్లోనే ఓపెన్‌కాస్టు గనుల్లో పనిచేస్తున్నారు. ఎండ తీవ్రతను తట్టుకోవడానికి తగిన రక్షణ చర్యలు చేపట్టాలి. వారి పని వేళల్లో మార్పుచేసి ఎండ తీవ్రత నుంచి కాపాడాలి. పట్టణంలోను చిరు వ్యాపారుల కోసం ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు చేసి వారికి ఎండ తీవ్రత లేకుండా చూడాలి.

– నాజర్‌పాషా, ఇఫ్టు నేత, మణుగూరు

దేశానికి ఆదర్శం కేసీఆర్


సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి పథకాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్.. భారతదేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటిఆర్ ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలోని విజయనగరం సమ్మక్క–సారలమ్మ ఆలయ ప్రాంగణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనానికి ఎమ్మెల్యే రేగా కాంతారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆయన వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై గ్రామగ్రామాన ప్రచారం నిర్వహించి ప్రజలకు తెలియజెప్పాలన్నారు. బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే బలమని...పార్టీ మరింత బలోపేతానికి, కమిటీల పటిష్టతకు ప్రతీ ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని అన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో మంత్రి కేటీఆర్ దిశానిర్దేశంలో పినపాక నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి కె.భవానీశంకర్, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షుడు ముత్యం బాబు, అడపా అప్పారావు, సొసైటీ చైర్మన్ కె.నాగేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డ్‌మెంబర్లు, పార్టీ మండల, పట్టణ, యువజన, మహిళా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు..

మత సామరస్యానికి ఇఫ్తార్ విందు ప్రతీక అని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండల పరిధిలోని పీవీకాలనీ కమ్యూనిటీహాల్‌లో గురువారం ఎమ్మెల్యే రేగా కాంతారావు నియోజకవర్గ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, బీఆర్ఎస్ నాయకులు ముత్యంబాబు, అడపా అప్పారావు, మైనార్టీ నాయకులు హబీబ్, రహీం, బాబ్ జాని, యూసఫ్, టీబీజీకేఎస్ నాయకులు ప్రభాకర్‌రావు, అబ్దుల్ రవూఫ్, మతపెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మలేరియా సర్వే


అశ్వారావుపేటరూరల్: రాళ్లవాగులో రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వలస గొత్తికోయల గ్రామమైన రాళ్లవాగులో గురువారం సామూహిక రక్త నమూనాలను సేకరించారు. వినాయకపురం పీహెచ్‌సీ వైద్యులు రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామంలోని 52 మందికి ఆర్‌డీటీ పరీక్షలు చేయగా.. అందరికీ మలేరియా నెగటివ్‌గా వచ్చినట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులకు దోమ తెరలు అందజేసి వడదెబ్బ తగలకుండా పాటించాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, హెచ్‌ఈఓ రాజు, హెచ్ఎస్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండాల: మండలంలోని మలేరియా ప్రభావిత ప్రాంతమైన గలబ గ్రామంలో గురువారం ప్రాథమిక వైద్య సిబ్బంది మలేరియా మాస్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. 140 మంది రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేయగా ఏ ఒక్కరికీ మలేరియా లేదని నిర్ధారణ అయినట్లు సీహెచ్‌ఓ శ్రీహరి, సబ్ యూనిట్ ఆఫీసర్ భద్రు తెలిపారు. గ్రామాల్లో దోమ తెరల వాడకాన్ని పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ విధిగా దోమ తెరలను వాడాలన్నారు. జ్వర లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే ఆస్పత్రికి రావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటీఎస్ సత్యం, ఏఎన్ఎం ధనమ్మ, హెల్త్ అసిస్టెంట్ బిక్ష, రమేష్, ఆశా వర్కర్ రామక్క తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లను జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అందించారు. బూర్గంపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో దివ్యాంగులు, డయాలసిస్ పేషంట్లు, విద్యార్థులకు ఉచిత బస్ పాసులను ఆమె అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 50 శాతం అంగవైకల్యం ఉన్న ప్రతి ఒక్కరూ ఆర్టీసీ ఉచిత బస్‌పాస్‌లు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా డయాలసిస్ పేషంట్లు, అర్హులైన విద్యార్థులు ఉచిత బస్‌పాసులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సిరిపురపు స్వప్న, ఎంపీడీఓ వివేక్‌రామ్,భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ రామారావు, ఆర్టీసీ సిబ్బంది, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి వర్గీయుల రాజీనామా


రాజీనామా ప్రకటిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ములకలపల్లి: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంటే తామంతా పయనిస్తామని, శీనన్నను సస్పెండ్ చేసిన బీఆర్ఎస్ పార్టీలో తాము కొనసాగలేమని పలువురు స్పష్టం చేశారు.

మండలకేంద్రంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయం నియోజకవర్గ నాయకుడు జారె ఆదినారాయణ అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సమావేశంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నాగళ్ల వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, పాతగంగారం సర్పంచ్ వాడే లక్ష్మి, టీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి, ములకలపల్లి ఉపసర్పంచ్ శనగపాటి అంజన్‌రావు, ములకలపల్లి టౌన్ ప్రెసిడెంట్ వంజరపు ఉమేశ్, బీసీ సెల్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు శ్రీరాముల నాగేశ్వరరావు, సర్దార్‌లతోపాటు పలువురు నాయకులు బీఆర్ఎస్‌కు మూకుమ్మడి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వీరితోపాటు పలువురు సీనియర్ నాయకులు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

క్లుప్తంగా

పనుల సందర్శన

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను గురువారం ఎంపీపీ ముత్తినేని సుజాత సందర్శించారు. అక్కడి కూలీలతో ఎంపీపీ సుజాత మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వేసవికాలం అలవెన్స్‌లు, చార్జీలు రావడం లేదని, కొత్త నిబంధనలతో మండుటెండలకు ఇబ్బంది పడుతున్నామని కూలీలు ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, సర్పంచ్ పర్శిక రాజమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, కార్యదర్శులు ప్రవీణ్, నరసయ్య పాల్గొన్నారు.

25న కంటి వైద్య శిబిరం

గుండాల: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఈ నెల 25న నవ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో పువ్వాడ ఫౌండేషన్ సహకారంతో ఉచిత కంటి ఆపరేషన్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం సభ్యులు ఆజాద్, వినయ్, సంతోష్, ప్రణయ్‌లు తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ శిబిరంలో ఖమ్మం మమత ఆస్పత్రి వైద్యులు అన్ని రకాల కంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. ఆపరేషన్ చేయించుకునే వారు స్థానిక ఆస్పత్రిలో కరోనా ర్యాపిడ్‌టెస్టు రిపోర్టు తీసుకోవాలని సూచించారు. బీపీ, షుగర్ ఉన్న వారు రెండు, మూడు రోజుల పాటు ఖమ్మం ఆస్పత్రిలో ఉండేందుకు వెంట ఓ మనిషిని తోడు తెచ్చుకోవాలని అన్నారు. ఉప సర్పంచ్ మానాల ఉపేందర్, ఎంపీటీసీ కృష్ణారావు, అప్పారావు, నర్సింహులు, నర్సింహరావు, షాహెద్, భాస్కర్ పాల్గొన్నారు.

ఏఎస్పీని కలిసిన కమిటీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏఎస్పీని గ్రీన్ భద్రాద్రి కమిటీ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు కామిశెట్టి కృష్ణార్జునరావు, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ గోళ్ల భూపతిరావు ఏఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ పారితోజ్ పంకజ్‌ను కలిసి గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. గ్రీన్ భద్రాద్రికి తన వంతు సహాయ సహకారాలను అందజేస్తానని ఈ సందర్భంగా ఏఎస్పీ తెలియజేశారు. కార్యాలయ ఆవరణలో పచ్చదనాన్ని పెంచేందుకు గ్రీన్ భద్రాద్రి సలహాలు, సూచనలు తీసుకుంటామని అన్నారు.

బాధితులను ఆదుకోవాలి

దుమ్ముగూడెం: మండలంలోని సీతానగరం గ్రామంలో సర్వేనంబర్ 51, 49 సాగు భూమిని సీతమ్మ ప్రాజెక్టు కరకట్ట నిర్మాణంలో కోల్పోతున్న బాధిత కుటుంబానికి ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లూరు, మండల కార్యదర్శి కోరం మురళిలు మద్దతు పలికారు. గురువారం బాధిత కుటుంబసభ్యులు చేస్తున్న దీక్షను సందర్శించి సంఘీభావం ప్రకటించారు. భూమికి పరిహారం దక్కకుంటే తమకు చావే శరణ్యమని బాధిత కుటుంబం పురుగు మందు డబ్బాలతో కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాజెక్టు నిర్మాణంలో 5ఎకరాల భూమిని కోల్పోతుండగా బాధిత కుటుంబానికి చిల్లి గవ్వ కూడా నష్టపరిహారం చెల్లించకుండా పనులు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక రెవెన్యూ అధికారులకు విషయం చెప్తే.. మీ భూమికి నష్టపరిహారం రాదు ఇవ్వాల్సిన వాళ్లకి ఇచ్చేసాం అంటూ ఎద్దేవా చేస్తున్నారని తెలిపారు. బాధితులను మోసం చేసి డబ్బులు కాజేసిన వ్యక్తిపై చర్యలు తీసుకునే పరిస్థితి ఎందుకుచేయడం లేదని ప్రశ్నించారు.

నిత్యావసరాల అందజేత

దమ్మపేట: మండల పరిధిలోని రంగువారిగూడెం గ్రామంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాద సంఘటనలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు గురువారం స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, పొంగులేటి ప్రధాన అనుచరుడు జారే ఆదినారాయణలు వేర్వేరుగా తగు ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం జరిగిన అగ్ని ప్రమాద బాధితులు బాల శ్రీనివాసరావు, బాట్ల చెన్నారావుల కుటుంబాలకు, స్థానిక ఎమ్మెల్యే నిత్యావసరాలైన వంట సరుకులను, తగు ఆర్థిక సహాయంను అందజేసి, వారిని పరామర్శించారు. అగ్ని ప్రమాదంలో జరిగిన నష్టమును అంచనా వేసి, ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని తహసీల్దార్ స్వామిని ఆదేశించారు. పొంగులేటి ప్రధాన అనుచరుడు జారే ఆదినారాయణ, అగ్ని ప్రమాద బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో, ఫోన్‌లైన్‌లో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో మాట్లాడించి, ధైర్యంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, చిన్నశెట్టి యుగంధర్, పర్వతనేని ప్రసాద్, సాయిల నర్సీ పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా మందిరంలో ప్రతి గురువారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి ఓ భక్తుడు రూ.21 వేలు విరాళం అందజేశాడు. పట్టణానికి చెందిన చవ్వాకుల కృష్ణమూర్తి, చంద్రావతి జ్ఞాపకార్థం వారి మనమళ్లు ఆనంద కృష్ణ, నాగ సంతోష్ చంద్రశేఖర్‌లు గురువారం ఆలయ కోశాధికారి రమేష్‌కు ఈ విరాళం అందజేశారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన


దమ్మపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సుడిగాలి పర్యటన చేసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దమ్మపేట గ్రామంలోని, మార్కెట్‌యార్డులో జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రజా ప్రతినిధులతో కలసి ప్రారంభించారు. మందలపల్లి గ్రామంలో ఇటీవలే మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో మృతురాలి భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, జిల్లా రైతు సమన్వయ సమితి సమితి సభ్యులు దారా యుగంధర్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, తహసీల్దార్ స్వామి, జీసీసీ మేనేజర్ నరసింహారావు, ఏఓ చంద్రశేఖరరెడ్డి, ఏఈఓ దీప్తి, బీఆర్ఎస్ నాయకులు కొయ్యల అచ్యుతరావు, అడపా రాంబాబు, చిన్నశెట్టి సత్యనారాయణ, యార్లగడ్డ బాబు తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాల సారం ఒక్కటే..

భద్రాచలంటౌన్: ప్రపంచంలోని అన్ని మతాల సారం ఒక్కటేనని, మతాల మధ్య సోదర భావం కలిగి ఉండాలని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పేద ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం సమకూర్చిన కానుకలను గురువారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బీఎస్సీ జంతుశాస్త్రం విద్యార్థులకు పిండోత్పత్తి శాస్త్రంపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎమ్.సునంద హాజరై పిండోత్పత్తి శాస్త్రంపై విస్తృతంగా విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ డి.భద్రయ్య, జంతుశాస్త్రం అధ్యాపకుడు శ్రీను, దుర్గభవాని, పావని పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

ములకలపల్లి: క్రైస్తవులకు మండలకేంద్రంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరుతూ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. గురువారం ఎమ్మెల్యేను కలిసి, సమస్యను విన్నవించారు. ఫెలోషిప్ అధ్యక్షుడు మనస్సే, సహాధ్యక్షుడు షాలోమ్, కార్యదర్శి యేసురాజు, కోశాధికారి జ్యోతికుమార్, మాజీ అధ్యక్షుడు యేసుదాసు, శ్రీనుపాల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితుడికి చేయూత


బూర్గంపాడు: బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

బూర్గంపాడు: సారపాకకు చెందిన శ్రీనివాస్ గత కొంతకాలంగా గొంతు కేన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆయన వైద్యఖర్చులకు కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో గురువారం రూ.20వేల ఆర్థికసాయాన్ని బాధితుడికి అందించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు టీఎస్ భాస్కర్‌రావు బాధితుడికి అన్నివిధాల అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి డాక్టర్ విజయ్‌కుమార్, రవికుమార్, ఎస్.సత్యనారాయణ, మరడాన శ్రీనివాస్, సాయిరామ్, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన పెరుమాళ్ల రమణ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గ్రామస్తులు కొందరు ఆమె వైద్యఖర్చులకు నిమిత్తం గురువారం కుటుంబసభ్యులకు రూ.15వేల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కై పు లక్ష్మీనారాయణరెడ్డి, సొసైటీ డైరెక్టర్ బత్తుల రామకొండారెడ్డి, జక్కిరెడ్డి మల్లారెడ్డి, మూల వెంకటరామిరెడ్డి, బిజ్జం వెంకటరామి రెడ్డి, మేడం సంజీవ రెడ్డి, వేముల సురేష్, శనగా మల్లేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల క్రాస్ రోడ్డుకు చెందిన కంద్రాతి తిరుపతమ్మ వైద్య ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు పడుతుండటంతో భారజల కర్మాగారం గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం గౌతమీనగర్ కాలనీలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో తిరుపతమ్మకు రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కె.సోమయ్య, ఎం.చైతన్య, సిహెచ్.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపంథా నిరసన, ధర్నా



దమ్మపేట: ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాపంథా నాయకులు, కార్యకర్తలు

పక్కా ఇళ్లు లేని ప్రతి పేదవాడికీ ప్రభుత్వమే ఇళ్లు కట్టించి, ఇంటి స్థలం ఉన్నవారికి 10 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం మంజూరు చేయాలని కోరుతూ.. రేషన్ దుకాణాల్లో 12 రకాల నిత్యావసర సరుకులను ప్రభుత్వమే ఉచితంగా పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ.. సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. నిరసనలో భాగంగా మొదటిగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆపై తహసీల్దార్ కార్యాలయాలకు చేరుకుని ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను తహసీల్దార్లకు, కార్యాలయ సిబ్బందికి అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్


తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న జిల్లా కార్యదర్శి రంగారెడ్డి


ములకలపల్లి: ధర్నా నిర్వహిస్తున్న ప్రజాపంథా నాయకులు

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి


చర్ల: సమ్మె శిబిరంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, యూటీఎఫ్ నాయకులు

అశ్వారావుపేటరూరల్: ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న వీవోఏలను ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. స్థానిక వీవోఏలు చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం వారంతా తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ.. వీవోఏలను వేతనం పెంచాలన్నారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక తహసీల్దార్ లూథరన్ విల్సన్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో వీవోఏలు ఎస్‌కె.షాహిన్, భాగ్యలత, శివ కుమారి, రేవతి, బేబీ, బుజ్జి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

చర్ల: రాష్ట్రంలో చాలీ చాలని వేతనాలతో బతుకులీడుస్తున్న వీఓఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి ప్రభుత్వాన్ని నిలదీస్తానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. గత నాలుగు రోజులుగా వీఓఏలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. వీఓఏలలో అర్హులైన వారిని సీసీల గుర్తించాలని, ఉద్యోగ భద్రతతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈయన వెంట టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి.రాజు, జిల్లా నాయకులు మురళీమోహన్, మండల అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, బాలకృష్ణ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు విజయశీల, స్థానిక నాయకురాళ్లు సుజాత, విజయలక్ష్మి, వరలక్ష్మి, స్వరూప తదితరులు ఉన్నారు.

బూర్గంపాడు: స్థానిక ప్రధాన కూడలిలో నాలుగు రోజులుగా గ్రామదీపికలు చేస్తున్న నిరసన నిరాహార దీక్షల్లో గురువారం సీఐటీయూ మండల కన్వీనర్ బర్ల తిరుపతయ్య పాల్గొని మాట్లాడారు. నిరాహారదీక్షలకు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు మారం వెంకటేశ్వరరెడ్డి, సీపీఐ ప్రజాపంథా జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు, మల్సూర్, ఎస్.అరుణ, వీఏఓల మండల సంఘం అధ్యక్షురాలు ఎన్ శ్రీలక్ష్మి, పద్మావతి, కమాల్‌బీ, పోశమ్మ, సాగరిక, నిర్మల, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల కేంద్రంలో దీక్షలు చేస్తున్న వీఓఏలకు గురువారం అశ్వాపురం–2 ఎంపీటీసీ సభ్యురాలు తుక్కాని గంగాభవాని, టీడీపీ మండల అధ్యక్షుడు తుక్కాని ప్రకాష్‌రావు సంఘీభావం తెలిపారు. కనీస వేతనం 26 వేలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

దమ్మపేట: సమ్మె చేస్తున్న గ్రామ దీపికలకు కాంగ్రెస్ మహిళా నాయకురాలు వగ్గెల పూజ తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. గురువారం ఆమె తన అనుచరులతో కలసి దీక్షా స్థలంలో కాసేపు కుర్చున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యాక్షులు బుసీ పాండురంగా, కందుల వెంకటేష్, బండారు మహేష్, వినోద్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

గుండాల: గుండాలలో పొంగులేటి వర్గీయులు, ఆళ్లపల్లిలో బీజేపీ నాయకులు వీఓఏల సమస్యల పరిష్కారానికి చేపట్టిన సమ్మెకు గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు శ్రీనివాస్, వజ్రం, పొంగులేటి వర్గీయులు ఎస్‌కె.ఖదీర్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో పొంగులేటి వర్గీయులు దారా అశోక్, బుచ్చయ్య, మోహన్, సమ్మయ్య, బీజేపీ నాయకులు అబ్బు శ్రీనివాస్, నాగేశ్వరరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: నాలుగో రోజు సమ్మె శిబిరాన్ని బీఎస్పీ నాయకులు సందర్శించి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఇర్పా రవికుమార్ మాట్లాడారు. సమ్మెలో పార్టీ నాయకులు అల్లెం కోటి, పి.మల్లికార్జునరావు, మౌనిక, శశిరేఖ, కిషోర్, శిరీష, నరేష్, వివోఏల సంఘం మండల అధ్యక్షురాలు సులోచన, కార్యదర్శి శ్రీనుగోపాల్, కోశాధికారి రమేష్, స్రవంతి, రాము, ధనలక్ష్మి, లలిత, లీల, వెంకటలక్ష్మి, అరుణ, వీవోఏలు పాల్గొన్నారు.